ఆక్రమణల చెరలో పొట్టేళ్ల వాగు

- లేఅవుట్ల నిర్మాణంతో కుచించుకుపోయిన వాగు
- పొదలకూరు చెరువుకు చేరని సాగునీరు
- ఆక్రమణలను తొలగించాలని కలెక్టర్‌కు ఫిర్యాదు
- వాగు పూర్తి నిడివిని కాపాడాలని రైతుల విజ్ఞప్తి


స్వరూపం కోల్పోయిన పొట్టేళ్ల వాగు

పొదలకూరు : పట్టణ సమీపంలో ఉన్న పొట్టేళ్ల వాగు ఆక్రమణదారుల చెరలో చిక్కుకుంది. ఈ వాగు నుంచి పొదలకూరు చెరువుకు సాగునీరందించే సప్లయ్ చానల్ సైతం ఆక్రమణలతో కుంచించుకుపోయింది. ఫలితంగా వాగు, సప్లయ్ చానల్ స్వరూపమే మారిపోయి పొదలకూరు చెరువుకు నీరు చేరడం లేదు. ఇటీవల పట్టణానికి చెందిన ఓ వ్యక్తి వాగు ఆక్రమణలపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఆయన ఆదేశాలతో ఇరిగేషన్ అధికారులు వాగు స్వరూపాన్ని కాపాడేందుకు రికార్డులను పరిశీలించి ఆక్రమణలను తొలగించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. అయితే చెరువు ఆయకట్టు రైతులు, లేఅవుట్ల యజమానులు వాగు స్వరూపాన్ని కాపాడాలంటే ఒకటి, రెండు చోట్ల కాకుండా అన్ని ప్రాంతాల్లో ఆక్రమణలను తొలగించాలని, అప్పుడే ప్రయోజనం ఉంటుందని అధికారులతో వాగ్వాదానికి దిగారు. దీంతో ఇరిగేషన్ అధికారులు వాగు ఆక్రమణలను గుర్తించేందుకు వెనుకాముందు ఆలోచిస్తున్నట్టు సమాచారం.

ఆక్రమణకు గురైన రూ.కోట్ల విలువైన స్థలం

పొట్టేళ్లవాగు పొదలకూరులోని నెల్లూరు రోడ్డులో ప్రారంభమై పార్లపల్లి మీదుగా బిరదవోలు వరకు సాగుతుంది. పొదలకూరు చెరువుకు సాగునీరు అందించే ఈ వాగు గత కొద్దికాలంగా లేఅవుట్లతో ఆక్రమణకు గురవుతూ వస్తోంది. పట్టణానికి సమీపంలో వాగు ఉండడం వల్ల కొందరు రియల్టర్లు వాగు పొరంబోకును లేఅవుట్లలో కలుపుకున్నారు. పొదలకూరులో భూముల విలువ రూ.కోట్లలో పలుకుతుండడంతో చాలాకాలంగా వాగు చుట్టూ వివాదాలు చోటుచేసుకుంటున్నాయి. తరచుగా అధికారులు కొలతలు వేసి ఆక్రమణలను తొలగించాలని ప్రయత్నించినా రాజకీయం జోక్యం, న్యాయపరమైన చిక్కులతో వెనుతిరగాల్సి వస్తోంది.

స్పందించని అధికారులు

పొదలకూరు చెరువు కింద 250 ఎకరాల ఆయకట్టు ఉంది. పొట్టేళ్ల వాగు నుంచి పొదలకూరు చెరువుకు సాగునీరు అందించే కాలువ పట్టణ పరిధిలో సుమారు 2 కి.మీ దూరం 70 అడుగుల వెడల్పుతో విస్తరించి ఉంది. అయితే గత కొద్దికాలంగా ఆక్రమణలు చోటుచేసుకుని కాలువ 20 అడుగులకు కుచించుకుపోవడంతో చెరువుకు సాగునీరు చేరడం లేదని రైతులు వాపోతున్నారు. ఫలితంగా పొదలకూరు చెరువుకు చేరాల్సిన వర్షపునీరు పార్లపల్లి చెరువుకు వెళ్లిపోతోందని చెబుతున్నారు. పొదలకూరు చెరువు నిండాలంటే కాలువ ఒక్కటే మార్గం. పొదలకూరు, లింగంపల్లి రైతులు వాగు ఆక్రమణలను తొలగించి కాలువను బాగుచేయాలని ఎన్ని పర్యాయాలు మొత్తుకున్నా అధికారులు స్పందించడం లేదు.

కొనసాగుతున్న వివాదం

పొట్టేళ్ల వాగు ఆక్రమణలను తొలగించే విషయంలో వివాదం కొనసాగుతోంది. లేఅవుట్లలో కలుపుకొన్న పొరంబోకును విడిపించి వాగును కాపాడాలని ఒక వర్గం డిమాండ్ చేస్తోంది. మరికొందరు వాగు ఎంత నిడివి ఉంటే అంత దూరం ఆక్రమణలను తొలగిస్తే అందరికీ ఉపయోగకరంగా ఉంటుందని అధికారులకు విజ్ఞప్తి చేస్తున్నారు. ఇరిగేషన్ శాఖ అధికారులు ఓ ప్రాంతంలో వాగును సర్వే చేసేందుకు వెళ్లగా అక్కడి వారు ఎగువ ప్రాంతం నుంచి చేసుకురావాలని వాగ్వాదానికి దిగారు. దీంతో అధికారులు తాత్కాలికంగా కొలతలను నిలిపివేసినట్లు తెలుస్తోంది. కాగా వాగు పరిస్థితిపై నెల్లూరు ఆర్డీఓ మలోల స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో మంగళవారం ఇరిగేషన్, రెవెన్యూ శాఖ అధికారులతో సమీక్ష నిర్వహించారు.


మురుగు కాలువగా మారిన చెరువు సప్లయ్ చానల్


ఇటీవల కాలువను పరిశీలిస్తున్న ఇరిగేషన్‌శాఖ ఉన్నత స్థాయి అధికారులు

సర్వేయర్ ద్వారా కొలతలు

పొట్టేళ్ల కాలువ సర్వేకు ఇరిగేషన్ అధికారులు కోరడంతో మండల సర్వేయర్‌ను పంపాం. వారు ఎప్పుడు అడిగితే అప్పుడు సర్వేయర్‌ను పంపి పొట్టేళ్ల కాలువ కొలతలు వేయిస్తాం. వాగు ఆక్రమణలకు సంబంధించిన పూర్తి బాధ్యత ఇరిగేషన్ అధికారులదే. రెవెన్యూ శాఖను పర్యవేక్షించమంటే మాత్రం తాము వెళతాం.

– బి.శివకృష్ణ, తహసీల్దార్, పొదలకూరు.

117 జీఓను రద్దు చేయాలి


ఎంఈఓకు వినతి పత్రం ఇస్తున్న యూటీఎఫ్ నేతలు

కొడవలూరు : జీఓ నంబర్ 117ను రద్దు చేయాలని కోరుతూ యూటీఎఫ్ నేతలు కొడవలూరులో ఎంఈఓ ఎన్.అంకయ్యకు బుధవారం వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా సంఘ మండల ప్రధాన కార్యదర్శి పి.తిరుపాలు మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా కామన్ సిలబస్ అమలు చేయాలని, ఉన్నత పాఠశాలల్లో ఆంగ్ల, తెలుగు మీడియంలను సమానంగా నడపాలని కోరారు. ప్లస్–2 పాఠశాలల్లో రెగ్యులర్ ఉపాధ్యాయులను నియమించాలని, మున్సిపల్ టీచర్‌లకు పీఎఫ్ సౌకర్యం కల్పించాలన్నారు. యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి ఖాజావలి, మండల నాయకులు సీహెచ్.మాలకొండయ్య, గౌస్‌బాషా, రవీంద్రబాబు, శ్రీహరి, జి.నాగభూషణం, టి.వెంకటేశ్వర్లు, మోహన్‌రావు, పి.శ్రీనివాసులు, శైలజ, లతామేరి, ప్రమీల పాల్గొన్నారు.

ఎంపీడీఓకు వినతి


వినతిపత్రం ఇస్తున్న యూటీఎఫ్ నాయకులు

బుచ్చిరెడ్డిపాళెం రూరల్ : ప్రాథమిక విద్యను నిర్వీర్యం చేస్తున్న జీఓ 117ను రద్దు చేయాలని బుచ్చిరెడ్డిపాళెం యూటీఎఫ్ నాయకులు ఎంపీడీఓ రాజ్యలక్ష్మికి బుధవారం వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో శ్రావణ్‌కుమార్, గోపి, దొరసానమ్మ, రమణారెడ్డి, శీనయ్య, ఓబయ్య తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

జీలుగ విత్తనాల పంపిణీ


విత్తనాలు అందుకుంటున్న కౌలు రైతులతో అధికారులు

వెంకటాచలం : మండలంలోని కంటేపల్లి గ్రామంలో కౌలు రైతులకు పచ్చిరొట్ట విత్తనాలైన జీలుగ విత్తనాలను మండల వ్యవసాయాధికారి హరికరుణాకర్‌రెడ్డి బుధవారం పంపిణీ చేశారు. ఈ విత్తనాలను 50 శాతం సబ్సిడీతో పంపిణీ చేస్తున్నామని, రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

గణనాథునికి ప్రత్యేక పూజలు


ప్రత్యేకాలంకరణలో వినాయకస్వామి

మనుబోలు : మనుబోలు బీసీ కాలనీ సమీపంలో ఉన్న వరసిద్ధి వినాయకునికి బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకుడు శ్రీనివాసులు స్వామివారికి పంచామృతాలతో అభిషేకం గావించి ప్రత్యేకాలంకరణ చేశారు. ప్రత్యేక పూజలు చేసి భక్తులకు తీర్థ ప్రసాదాలు వితరణ చేశారు. ఉభయకర్తలుగా కావేటి గంధళ్ల కృష్ణయ్య, అన్నపూర్ణమ్మ దంపతులు వ్యవహరించారు.

విచారణ జరపాలి

ముత్తుకూరు : ముత్తుకూరు మేజర్ పంచాయతీలో మూడేళ్లుగా జరిగిన నిధుల దుర్వినియోగంపై విచారణ జరిపించాలని రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి పవన్‌కల్యాణ్‌కు సర్పంచ్ బూదూరు లక్ష్మి బుధవారం వినతిపత్రం అందజేశారు. అవినీతికి పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డితో కలిసి ఆమె మంత్రిని అమరావతిలో కలిశారు. స్థానిక నాయకులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై కళాజాత



కొడవలూరు : మండలంలోని యల్లాయపాళెంలో సీజనల్ వ్యాధులపై కళాజాత ద్వారా బుధవారం అవగాహన కల్పించారు. ఆరుబయట బహిర్భూమికి వెళ్లడం అనారోగ్యాలకు మూలమని, పరిశుభ్రమైన నీటిని కాచి చల్లార్చి తాగాలని వివరించారు. అదేవిధంగా పరిసరాల పరిశుభ్రత, వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని, దోమలను నివారించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ కత్తి కృష్ణమ్మ, పంచాయతీ కార్యదర్శి వగ్గు శీనయ్య, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

సిబ్బందికి జీతాలు విడుదల చేయాలి

నెల్లూరు(అర్బన్): వైద్య విధాన పరిషత్ ఏరియా ఆస్పత్రుల్లో రెగ్యులర్ మెటర్నిటీ అసిస్టెంట్లుగా పనిచేస్తున్న 80 మంది.. కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ విధానంలో పనిచేస్తున్న 115 మంది ఏఎన్‌ఎంలకు జీతాలను వెంటనే విడుదల చేసేలా హంస రాష్ట్ర నేతలు ప్రభుత్వంతో చర్చించాలని సంఘ నేత చేజర్ల సుధాకర్‌రావు కోరారు. ఈ మేరకు విజయవాడలోని సిద్ధార్థ హాస్పిటల్లో హంస రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ సమావేశాన్ని బుధవారం నిర్వహించారు. సంఘ నెల్లూరు జిల్లా అసోసియేట్ ప్రెసిడెంట్ నారాయణరాజు తదితరులు పాల్గొన్నారు.

జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలివ్వాలని వినతి

నెల్లూరు(దర్గామిట్ట): అర్హులైన జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలివ్వాలని సీనియర్ జర్నలిస్ట్ మల్లికార్జున కోరారు. ఈ మేరకు కలెక్టర్ ఆనంద్‌కు వినతిపత్రాన్ని బుధవారం అందజేసిన అనంతరం ఆయన మాట్లాడారు. జర్నలిస్టుల పిల్లలకు ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలల్లో 50 శాతం ఫీజు రాయితీ, ప్రెస్‌క్లబ్‌ను ఏర్పాటు చేయాలని కోరారు. కనుపర్తిపాడు, ఆమంచర్లలో జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలను గుర్తించినా, అందజేయడంలో ఆలస్యమవుతోందని చెప్పారు.

మినీ గోకులాలపై సమీక్ష

నెల్లూరు(బారకాసు): పశువులకు వచ్చే వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని జిల్లా పశు వైద్యాధికారి కోటేశ్వరరావు కోరారు. నేషనల్ లైవ్ స్టాక్ మిషన్ అవగాహన కార్యక్రమంలో భాగంగా మినీ గోకులాలపై బుధవారం నిర్వహించిన జిల్లా స్థాయి సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. గోకులం పథకాన్ని జిల్లా వ్యాప్తంగా అన్ని మండలాల్లో అమలు చేయాలని కోరారు. జిల్లాలో 1300 పశువులు, గొర్రెల షెడ్లను ఉపాధి హామీ పథకం ద్వారా నిర్మించాలని లక్ష్యంగా నిర్దేశించుకున్నామని చెప్పారు. ఉప సంచాలకులు రమేష్‌నాయక్, డాక్టర్లు చంద్రశేఖర్, నాగమణి తదితరులు పాల్గొన్నారు.

ఆంగ్లంలో పట్టు సాధించడమే లక్ష్యం

- ఎంఈఓ దిలీప్‌కుమార్


ప్రశంసాపత్రం అందుకున్న ఉపాధ్యాయిని

బుచ్చిరెడ్డిపాళెం రూరల్ : విద్యార్థులు ఆంగ్లంలో పట్టు సాధించడమే లక్ష్యంగా పని చేస్తున్నామని బుచ్చిరెడ్డిపాళెం ఎంఈఓ దిలీప్‌కుమార్ అన్నారు. పట్టణంలోని డీఎల్‌ఎన్నార్ ఉన్నత పాఠశాలలో విభా లీప్ ఫర్ వర్డ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో అల్లూరు, బుచ్చిరెడ్డిపాళెం, విడవలూరు మండలాల ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయులకు ఆంగ్లభాషపై ఒక్కరోజు శిక్షణా కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఇందులో పాల్గొన్న ఎంఈఓ దిలీప్‌కుమార్ మాట్లాడుతూ సమగ్రశిక్ష ఆదేశాల మేర కు ఉపాధ్యాయులకు ఆంగ్లభాషా నైపుణ్యాలు, బోధనపై శిక్షణ ఇస్తున్నట్లు తెలియజేశారు. విద్యార్థులు ఆంగ్లభాషలో పట్టు సాధించేలా ఉపాధ్యాయులు బోధన చేయాలని సూచించారు. ప్రాథమిక స్థాయిలో విద్యార్థులకు ఆంగ్లంపై పట్టు సాధించేలా శిక్షణ ఇవ్వడం ద్వారా బంగారు భవితకు బాటలు పడుతుందన్నారు. అనంతరం శిక్షణలో పాల్గొన్న ఉపాధ్యాయులకు ప్రశంసా పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో ఎంఈఓ–2 రత్నం, విభా ఫౌండేషన్ మాస్టర్ ట్రైనర్ చైతన్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గ్రంథాలయ పితామహుడు ‘అయ్యంకి’


కొడవలూరు : ‘అయ్యంకి’ చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న గ్రంథాలయాధికారి తదితరులు


బుచ్చిరెడ్డిపాళెం రూరల్ : స్థానిక గ్రంథాలయంలో..

కొడవలూరు : గ్రంథాలయ ఉద్యమానికి జీవం పోసి గ్రంథాలయ పితామహుడిగా అయ్యంకి వెంకటరమణయ్య కీర్తి గడించినట్లు లైబ్రేరియన్ కె.రాజేశ్వరి కొనియాడారు. అయ్యంకి జయంతిని పురస్కరించుకుని కొడవలూరులోని గ్రంథాలయంలో అయ్యంకి చిత్రపటానికి బుధవారం పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ‘గ్రంథాలయ సర్వస్వం’ అనే పత్రికను స్థాపించి అనితర సాధ్యమైన రీతిలో ఏడు దశాబ్దాల పాటు ఆంధ్రప్రదేశ్ గ్రంథాలయ ఉద్యమాన్ని ప్రభావితం చేసిన మహనీయుడు అయ్యంకి అని తెలిపారు. ఎంతో మంది పాఠకులకు విజ్ఞానం పెంపొందిస్తున్న గ్రంథాలయాలు అయ్యంకి కృషి వల్లే ఆవిర్భవించాయని స్పష్టం చేశారు. రిటైర్డ్ ప్రధానోపాధ్యాయుడు కత్తి వెంకయ్య మాట్లాడుతూ గ్రంథాలయ ఉద్యమానికి స్థిరమైన రూపురేఖలు దిద్దిన మహనీయుడు పాతూరి నాగభూషణం అని తెలియజేశారు. నాగభూషణం వర్ధంతి సందర్భంగా ఆయన్ను స్మరించుకున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పాఠకులు పాల్గొన్నారు.

‘అయ్యంకి’ అభ్యుదయం స్ఫూర్తిదాయకం

బుచ్చిరెడ్డిపాళెం రూరల్ : గ్రంథాలయ ఉద్యమానికి జీవితాంతం విశేష కృషి చేసి సమాజాన్ని అభ్యుదయ మార్గంలో నడిపిన అయ్యంకి వెంకటరమణయ్య సేవలు నేటి తరానికి స్ఫూర్తిదాయకమని లైబ్రేరియన్ కె.మంజులత అన్నారు. బుచ్చిరెడ్డిపాళెం శాఖా గ్రంథాలయంలో గ్రంథాలయోద్యమ పితామహుడు అయ్యంకి వెంకటరమణయ్య జయంతి వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజా గ్రంథాలయమే ప్రజల విశ్వవిద్యాలయమని ఘనంగా చాటినట్లు గుర్తుచేశారు. కార్యక్రమంలో జిల్లా రిసోర్స్ గ్రూప్ సభ్యులు గండికోట సుధీర్‌కుమార్, పాఠకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పంటకోత ప్రయోగాలపై దృష్టి సారించాలి


వీఏఏలకు శిక్షణ ఇస్తున్న ఏఓ, ఏఎస్‌ఓలు

కొడవలూరు : పంటకోత ప్రయోగాలపై వీఏఏ(గ్రామ వ్యవసాయ సహాయకులు)లు దృష్టి సారించాలని ఏఓ లక్ష్మి సూచించారు. స్థానిక వ్యవసాయశాఖ కార్యాలయంలో పంటకోత ప్రయోగాలపై వీఏఏలకు బుధవారం శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పంటకోత ప్రయోగాల ద్వారా పంట దిగుబడిని అంచనా వేయొచ్చని తెలియజేశారు. ఏమైనా విపత్తుల కారణంగా పంట నష్టపోతే రైతులకు ఈ దిగుబడుల ఆధారంగానే బీమా చెల్లిస్తారన్నారు. ఏఎస్ఓ రమాగాయత్రి పంటకోత ప్రయోగాలు ఎలా చేయాలో ప్రయోగాత్మకంగా వివరించారు. నిర్దేశించిన ప్రాంతాల వారీగా పంటకోత ప్రయోగాలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ ఎ.అనూష, వీఏఏలు పాల్గొన్నారు.

మనుబోలు ఇన్‌చార్జి ఎంఈఓగా లీలాకుమార్


బాధ్యతలు చేపట్టిన లీలాకుమార్

మనుబోలు : మనుబోలు మండల ఇన్‌చార్జి విద్యాశాఖాధికారిగా కె.లీలాకుమార్ బుధవారం బాధ్యతలు చేపట్టారు. మనుబోలు ఎంఈఓగా ఉన్న శేషాద్రివాసు ఇటీవల బదిలీ అయిన విషయం తెలిసిందే. ఆయన స్థానంలో రాపూరు ఎంఈఓగా ఉన్న లీలాకుమార్‌ను మనుబోలు ఇన్‌చార్జిగా నియమించారు. ఈ మేరకు ఆయన మండల కేంద్రంలోని ఎంఈఓ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. మండల పరిధిలో విద్యాశాఖ, ప్రభుత్వ పాఠశాలల్లోని సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఈ సందర్భంగా తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

వెంకటాచలం : ఆటోను మోటారు బైక్ ఢీకొని వ్యక్తి గాయపడిన ఘటన మండలంలోని గొలగమూడి సమీపంలో బుధవారం జరిగింది. నెల్లూరు నగరం కొండాయపాళెం ప్రాంతానికి చెందిన కిశోర్ ముత్తుకూరు మండలం పంటపాళేనికి బైక్ వెళ్తుండగా, గొలగమూడి సమీపంలో బైక్ అదుపుతప్పి ఆటోను ఢీకొంది. ఈ ప్రమాదంలో కిశోర్‌కు గాయాలవ్వగా చికిత్స నిమిత్తం నెల్లూరుకు తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ప్రజారంజకంగా బడ్జెట్

పొదలకూరు : కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ ప్రజారంజకంగా ఉందని బీజేపీ మండల నాయకులు పేర్కొన్నారు. స్థానిక బస్టాండ్ సెంటర్‌లో బుధవారం వారు విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బంగారు ధరలను తగ్గించడం వల్ల శ్రావణ మాసంలో వివాహాలు చేసుకునే వారికి వెసులుబాటుగా ఉంటుందన్నారు. రాష్ట్ర రాజధాని నిర్మాణానికి నిధుల కేటాయింపు, పోలవరం ప్రాజెక్టుకు సహకారం అందిస్తామని ప్రకటించడం శుభపరిణామంగా పేర్కొన్నారు. సమావేశంలో చింతగింజల చిన సుబ్రహ్మణ్యం, రాచపూడి ధనుంజయరావు, బల్లి పిచ్చయ్య, దినేష్‌చక్రవర్తి, అక్కెం జనార్ధన్‌రెడ్డి, పద్మనాభయ్య, ప్రశాంత్, శ్రీహరి, రామచంద్రయ్య, ఓబులేసు పాల్గొన్నారు.

విద్యా సామగ్రి వితరణ



తోటపల్లిగూడూరు : మండలంలోని పాపిరెడ్డిపాళెం ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు స్థానిక గ్రామ పెద్దలు ప్లేట్లు, ఇతర విద్యా సామగ్రిని బుధవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఉప సర్పంచ్ మేనాటి శీనయ్య మాట్లాడుతూ విద్యార్థులు బాగా చదువుకుని ఉన్నతంగా రాణించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో గ్రామ నాయకులు పరుచూరు హరిబాబు, దద్దోలు మనోహర్, సుధాకర్‌రెడ్డి, రాధాకృష్ణారెడ్డి, శ్రీనివాసులురెడ్డి, మేనాటి రామయ్య, విజయ్, హెచ్‌ఎం వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ఇంటింటికీ తాగునీటి కనెక్షన్


మాట్లాడుతున్న సర్పంచ్ మల్లికార్జున

విడవలూరు : వరిణి గ్రామంలో ఇంటింటికీ తాగునీటి కుళాయి కనెక్షన్ ఉండాలని సర్పంచ్ రావెళ్ల మల్లికార్జున అన్నారు. మండలంలోని వరిణిలో జలజీవన్ మిషన్‌పై అవగాహన కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన జలజీవన్ పథకాన్ని గ్రామస్తులు ఉపయోగించుకుని నీటి సమస్యలను పరిష్కరించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ భక్తవత్సలం, ఉప సర్పంచ్ భద్రయ్య, వీఆర్వో సుబ్బయ్య, పంచాయతీ సెక్రటరీలు శ్రీనివాసులు, సుఖన్య పాల్గొన్నారు.

శారీరక సౌష్టవానికి క్రీడలు దోహదం


పొదలకూరు : పరుగు పందెంలో తలపడుతున్న విద్యార్థులు


ముత్తుకూరు : మ్యూజికల్ చైర్స్ ఆడుతున్న విద్యార్థినులు

ముత్తుకూరు : శారీరక సౌష్టవానికి, బుద్ధి వికాసానికి క్రీడలు ఎంతో దోహదపడుతాయని ముత్తుకూరులోని ఈదూరు ఈశ్వరమ్మ జెడ్పీ హైస్కూల్ హెచ్‌ఎం శ్రీనివాసులురెడ్డి అన్నారు. శిక్షా సప్తాహ్ కార్యక్రమంలో భాగంగా బుధవారం విద్యార్థులతో 75 స్వదేశీ ఆటలు ఆడించారు. ఈ సందర్భంగా కుందుడుగుమ్మ, గోళీలు, బొంగరాలు, అచ్చినకాయలు, కబడ్డీ తదితర ఆటలు విద్యార్థులు ఆడారు. విద్యార్థులు స్వదేశీ ఆటలను మరిచిపోవద్దని విజ్ఞప్తి చేశారు. ఫిజికల్ డైరెక్టర్ శేషయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యార్థులకు క్రీడా పోటీలు

పొదలకూరు : శిక్షా సప్తాహ్‌లో భాగంగా మూడో రోజున బుధవారం స్థానిక డీఎన్నార్ జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో శారీరక సౌష్టవం, మానసిక ఉల్లాసం గురించి వివరిస్తూ విద్యార్థులకు క్రీడాపోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జి హెచ్ ఎం ఏవీ సుధాకర్ మాట్లాడుతూ క్రీడలు మానసిక ఉల్లాసానికి, శారీరక దృఢత్వానికి ఎంతగానో ఉపయోగపడుతాయన్నారు. విద్యార్థులకు పరుగు పందెం, కబడ్డీ, క్రికెట్ పోటీలను నిర్వహించామన్నారు. ఈ కార్యక్రమంలో పీఈటీ సునీత, శివకుమార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆధార్ క్యాంపులను సద్వినియోగం చేసుకోండి


మనుబోలు : వెంకన్నపాళెంలో ఆధార్ నమోదు చేస్తున్న సిబ్బంది


కొడవలూరు : రామన్నపాళెంలో ఆధార్ నమోదును పరిశీలిస్తున్న ఈఓపీఆర్డీ డేవిడ్

మనుబోలు : మండలంలోని పలు గ్రామాల్లో నిర్వహిస్తున్న ఆధార్ స్పెషల్ క్యాంపులను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ కార్యాలయ ఏఓ రవికుమార్ రెడ్డి సూచించారు. ఈనెల 23 నుంచి 27వ తేదీ వరకు ఈ ప్రక్రియ కొనసాగుతుందన్నారు. ఐదేళ్లలోపు చిన్నారులకు కొత్తగా ఆధార్ నమోదు చేయడం, ఇప్పటికే ఆధార్ ఉన్న వారికి అవసరమైన మార్పు చేర్పులు చేస్తారని తెలిపారు. మండలంలో రెండు ఆధార్ సెంటర్లు పనిచేస్తున్నందున అన్ని సచివాలయాల పరిధిలో వారితోనే క్యాంపులు నిర్వహించి నమోదు ప్రక్రియ చేపట్టినట్లు తెలిపారు. ఈ క్రమంలో బుధవారం వెంకన్నపాళెంలో ఆధార్ నమోదు ప్రక్రియ నిర్వహించారు. ఉదయం 10 నుంచి సాయంత్రం వరకు వంద మంది ఆధార్ నమోదు చేయించుకున్నట్లు వెల్లడించారు.

ఆధార్ శిబిరం పరిశీలన

కొడవలూరు : మండలంలోని రామన్నపాళెంలో ఏర్పాటు చేసిన ఆధార్ ప్రత్యేక శిబిరాన్ని ఈఓపీఆర్డీ వి.డేవిడ్ బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటికీ అనేక మంది గిరిజనులకు ఆధార్ లేదని, అలాంటి వారిపై సచివాలయ సిబ్బంది ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. అదేవిధంగా ఆధార్‌లో తప్పులు రావడం వల్ల అనేక మంది ఇబ్బందులు పడుతున్నారని, వారు ఈ శిబిరాల్లో సరి చేసుకోవాలని చెప్పారు. ఆయన వెంట పంచాయతీ కార్యదర్శి డి.సురేష్‌కుమార్, మండల రిసోర్స్ కో–ఆర్డినేటర్ వి.మనోజ్‌కుమార్‌రెడ్డి, సచివాలయ సిబ్బంది ఉన్నారు.

భూసార పరీక్షలు తప్పనిసరి


మాట్లాడుతున్న వ్యవసాయాధికారులు

పొదలకూరు : రైతులు తప్పనిసరిగా భూసార పరీక్షలు చేయించుకుని పంటల సాగు చేయాలని జిల్లా వనరుల కేంద్రం వ్యవసాయాధికారి యు.గీతాకుమారి సూచించారు. పొదలకూరు మండలం డేగపూడి గ్రామంలో ఆత్మ సౌజన్యంతో రైతులకు సమగ్ర ఎరువుల యాజమాన్యంపై శిక్షణ సదస్సును బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ భూసార పరీక్షల ఆధారంగా రైతులు ఎరువులను వాడుకుంటే దిగుబడులు పెరుగుతాయన్నారు. సేంద్రియ ఎరువులు వాడనందున నేల జీవం కోల్పోయి క్రమంగా పంట ఉత్పాదకత క్షీణిస్తుందని తెలిపారు. తర్వాత రసాయన ఎరువుల మోతాదు పెంచాల్సి వస్తుందన్నారు. దీనివల్ల సూక్ష్మపోషకాల లోపాలు అధికమై పంటల దిగుబడి తగ్గుతుందన్నారు. నెల్లూరు, తిరుపతిలో లభించే జీవన ఎరువులను వాడుకుని రసాయన ఎరువుల మోతాదు 25 శాతం వరకు తగ్గించుకోవాల్సిందిగా సూచించారు. రసాయన ఎరువుల వాడకం వల్ల కలిగే అనర్థాల గురించి కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త కె.కిరణ్‌కుమార్‌రెడ్డి రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ఓబుల్‌రెడ్డి, ఇఫ్కో జిల్లా సేల్స్ మేనేజర్ వి.లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.